క్లుప్తంగా

బాధిత మహిళలకు వసతులు కల్పించాలి

జిల్లా న్యాయసేవాధికారి కేవీఆర్ కృష్ణయ్య



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లైంగికదాడులకు గురైన మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించాలని కృష్ణా జిల్లా న్యాయసేవాధికారి, న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య తెలిపారు. పాత ప్రభుత్వాసుపత్రిలోని దిశ వన్ స్టాప్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. దిశ కేంద్రం ద్వారా మహిళలకు అందుతున్న సౌకర్యాలు, న్యాయ సహాయం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దిశ కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి, సఖీ సిబ్బంది డి. స్వప్న, పారామెడికల్ స్టాఫ్‌తో మాట్లాడారు.

ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇంద్రకీలాద్రిపైగల దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానానికి వెళ్లే ఘాట్ రోడ్‌లో కొండ రాళ్లు పడిన ప్రదేశాన్ని దేవస్థానం పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు గురువారం పరిశీలించారు. ప్రస్తుతం ఘాట్ రోడ్‌లో రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన ఎక్కడైతే కొండ రాళ్లు పైనుంచి పడుతున్నాయి, ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేస్తున్న రక్షణ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా మరిన్ని రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమ, ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శరాబందీరావుకు డాక్టరేట్ ప్రదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌కు చెందిన లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రముఖ సేవాతత్పరుడు అన్నాబత్తుల శరాబంధీరావుకు హోప్ థియోలాజికల్ యూనివర్శిటీ ఆధ్వర్యాన గౌరవ డాక్టరేట్ అందజేశారు. హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం జరిగిన గౌరవ డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ వేణుగోపాలాచారి చేతులమీదుగా డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. శరాబంధీరావును లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

మరమ్మతులకు విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు పశువైద్యశాల మరమ్మతులకు గురువారం ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ మందిర కమిటీ ఆధ్వర్యాన విరాళం అందించామని పేర్కొన్నారు.

రూ.20 కోట్లతో డివిజన్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



డివిజన్‌లో స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, చైతన్యరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 42వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. భవానీపురం 42వ డివిజన్ పరిధిలోని వెలంపల్లి కాలనీ, హెచ్‌బీ కాలనీలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు స్థానిక కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ రూ.20కోట్ల పైగా నిధులతో డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీలు, రోడ్లు, పార్కులు అభివృద్ధి పరిచామన్నారు. గతంలో హెచ్‌బీ కాలనీలో అనేక ఓపెన్ స్థలాలు చెరువులుగా మారిన నేపథ్యంలో వాటిని అభివృద్ధి పరిచి సుందరీకరణ చేశామని చెప్పారు. వర్షాకాలం చిన్న చిన్న ప్రాంతాలు జలమయం కావడం సహజమని, వాటిని కూడా ప్రతిపక్షాలు రాజకీయం చేయడం సబబు కాదన్నారు. నగరపాలక సంస్థ అధికారులు విధులు నిర్వహిస్తుంటే ప్రతిపక్షాలు వారి దగ్గరకి వెళ్లి ఫొటోలు దిగడం హేయమైన చర్య అన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న జలీల్‌ఖాన్, అప్పటి టీడీపీ కార్పొరేటర్ ఈ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. జలీల్ ఖాన్ అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నానని చెప్పి.. పార్టీ మారి చేసిందేమీ లేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో పోరాటాలతో పని లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తున్నట్లు తెలిపారు. జనసేన, టీడీపీ ఎన్ని దుమారాలు లేపినా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్పొరేటర్ పడిగపాటి చైతన్య రెడ్డి, సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• నవజాతకు ఉచిత వైద్యం





విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు విభాగంలో ఏర్పాటు చేసిన స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ), నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎన్ఐసీయూ) అందుబాటులోకి వచ్చాయి. నవజాత శిశువులకు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మెరుగైన వైద్యం ఉచితంగా అందించేందుకు రూ.5.53 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ వైద్య విభాగాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, పిడియాట్రిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. – లబ్బీపేట(విజయవాడతూర్పు)

గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్‌కలామ్



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకట్రావు, ఎన్వీ రావు, సూర్యారావు తదితరులు



అబ్దుల్‌కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షేక్ ఆసిఫ్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త భారతరత్న అబ్దుల్‌కలామ్ అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. వించిపేటలోని షేక్ ఆసిఫ్ కార్యాలయంలో అబ్దుల్‌కలామ్ వర్ధంతిని పురస్కరించుకొని నివాళి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. మిసైల్ మేన్ ఆఫ్ ఇండియాగా గణతికెక్కిన కలామ్ దేశంలో సాంకేతికరంగ అభ్యున్నతికి విశేషమైన సేవలందించారన్నారు. భారతీయ శాస్త్రసాంకేతిక రంగాల్లో ఆయన చూపించిన ప్రతిభ ప్రపంచంలో దేశ ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేసిందని చెప్పారు. దేశాభ్యున్నతి కోసం పాటుపడ్డారని కొనియాడారు. మిసైల్ రంగం అభివృద్ధికి ఆయన ఎనలేని సేవలందించారిని పేర్కొన్నారు. అత్యంత సామాన్యమైన కుటుంబంలో పుట్టి నిరంతర శ్రమతో దేశంలోనే అత్యున్నతమైన అధ్యక్ష పీఠాన్ని అందుకున్నారని వివరించారు. దేశంలోని యువత, విద్యార్థులను తన ప్రసంగాలతో నిరంతరం ప్రోత్సహించారన్నారు. ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉస్మాన్, ఫిరోజ్, మూర్తి, షవర్, మొయిన్, నయీమ్, లాల్‌అహ్మద్, సయ్యద్ హై, ఖాజా, జిలాని, యేసు తదితరులు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియాగా ఇస్రోకు ఎన్నో సేవలు అందించి భారత దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని అబ్దుల్ కలాం సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ వేముల వెంకట్రావు కొనియాడారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గురువారం ఆంజనేయవాగు సెంటర్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యావేత్త ఎన్వీ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కలలు కనండి.. ఆ కలలను సాకారం చేసుకోండి అన్న అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. మరో విద్యావేత్త నల్లాని సూర్యారావు మాట్లాడుతూ దేశాన్ని ముందుకు నడిపించాలంటే విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. పారిశ్రామికవేత్త చింతలపూడి సత్యనారాయణ మాట్లాడుతూ దేనిలోనైనా విజయం సాధించాలంటే ముందుగా ఓటమిని భరించాలని, ఆ ఓటమే భవిష్యత్‌లో విజయ సోపానానికి నాందిగా భావించాలని పేర్కొన్నారు. బీసీ నాయకులు బలివాడ శివకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ ఒక సమస్య వస్తే దానిని ఎదుర్కొనే సమయంలోనే మన ప్రతిభ బయట పడుతుందన్నారు. ఏడుకొండలరావు మాట్లాడుతూ చిన్న విజయాన్ని చూసి పొంగిపోకూడదని, అది తొలి అడుగు మాత్రమే తప్ప గమ్యం కాదన్నారు. పిల్లా జగ్గు, కె నాగేశ్వరరావు, పి వెంకటరమణ, బెవర దుర్గారావు, మిరియాల దుర్గారావు, కూరపాటి ప్రశాంత కుమార్, స్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కట్స్ పంపిణీ చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్‌లో పాల్గొనండి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పటమట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ నగరాలకు నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో విజయవాడ నగరపాలక సంస్థ పాల్గొంటుందని, ఈ ఏడాది జరిగే ఈ సర్వేలో నగరవాసులు తమ అభిప్రాయాన్ని ఆన్‌లైన్‌ద్వారా తెలపాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సుర్వేక్షన్ 2023 ఫీడ్ బ్యాక్ లో పాల్గొనేందుకు హెచ్‌టీటీపీఎస్://వీఎఫ్‌సిటీ-పీఆర్‌వోడీడాట్‌ఎస్‌బీఎంఅర్బన్‌డ.ఆర్జీ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూడాట్‌మైజీవోవీడాట్‌ఇన్/మైజీవోవీ-సర్వే-స్వచ్ఛ సర్వేక్షణ్-2023/ లింక్ ద్వారా లేదా గూగుల్ ప్లే స్టోర్/యాప్ స్టోర్ నుంచి స్వచ్ఛత యాప్ 2023లో ఓట్ ఫర్ మై సిటీ ఆప్షన్‌లో 4 విధాల్లో స్వచ్ఛ సుర్వేక్షణ్ 2023 ఫీడ్ బ్యాక్ ను అందించవచ్చని పేర్కొన్నారు. ఈ లింక్లు/యాప్ లోకి వెళ్ళాకా ప్రతి ఒక్కరూ మొబైల్ నెంబర్‌ను నమోదు చేయాలని తెలిపారు. దానికి ఓటీపీ (ఒన్‌టైం పాస్‌వర్డ్) వస్తుందని, ఆ పాస్‌వర్డ్‌ని నమోదు చేస్తే భాష ఎంపిక అనంతరం ఫీడ్‌బ్యాక్ఇచ్చే వారి వివరాలు, రాష్ట్రం, జిల్లా, నగరం, ప్రదేశం పేరు, లింగము, వయస్సు నమోదు చేయాలని సూచించారు. అవన్నీ నమోదు చేసిన తర్వాత సర్వే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 9 ప్రశ్నలకు అభిప్రాయం తెలపాలని కోరారు. వ్యర్థాల సేకరణ, వ్యర్థాల విభజన, నగర శుభ్రత, రీ సైకిల్, రీ యూస్, రెడ్యూస్ కేంద్రాలు, కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లు వంటి అంశాలపై నగర పరిశుభ్రతను పరిగణలోకి తీసుకొని అభిప్రాయాన్ని నమోదు చేయాలని కోరారు.

మోడల్ పాఠశాలలుగా కేంద్రీయ విద్యాలయాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎన్వీ రావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2020 జాతీయ విద్యా విధానం వల్ల కేంద్రీయ విద్యాలయాలు అంతర్జాతీయ స్థాయి మోడల్ పాఠశాలలుగా మారాయని విజయవాడ కేంద్రీయ విద్యాలయం-1 ప్రిన్సిపాల్ ఎన్వీ రావు తెలిపారు. సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశపెట్టి మూడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ కేంద్రీయ విద్యాలయం ప్రథమ స్థానం సంపాదించిందన్నారు. పాఠశాల ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పాఠశాల డిజిటలైజేషన్ మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దడానికి రూ.కోటి ఐదు లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా పాఠశాలకు చక్కటి ల్యాబ్‌లు మోడల్ విద్యా విధానాన్ని అభ్యసించడానికి కావాల్సిన ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకొన్నామని చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020 భాగంగా మూడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 29వ తేదీన దేశ రాజధానిలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని తమ పాఠశాల విద్యార్థులకు చూపించే విధంగా లైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ పీఎస్‌వీఎస్ఆర్ కృష్ణ, సీబీఎస్ఈ రీజనల్ ఆఫీసర్స్ మీనూజోషి, శేఖర్ చంద్రన్, ఎం.వెంకటేశ్వరరావు, వీపీ సిద్ధార్థ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తదితరులు పాల్గొని నూతన జాతీయ విద్యావిధానం ప్రాధాన్యత , వివిధ అంశాల్లో అమలు చేస్తున్న విధానాలపై విశ్లేషణ చేశారు. నూతన విద్యా విధానంలో భాగంగా అమలు చేస్తున్న నిపుణ్‌భారత్, ఫౌండేషన్ లిటరసీ, అండ్ న్యూమరసీ, బాలవాటిక, పీఎం ఇ-విద్య , విద్యాంజలి, అటల్ టింకరింగ్ ల్యాబ్, టీచర్‌ల శిక్షణ అంశాల గురించి మాట్లాడారు. అనంతరం కేంద్రీయ విద్యాలయంలో మొక్కలు నాటారు. సీబీఎస్ విద్యాబోధన పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి స్థలం కేటాయించాలని వినతి



ప్రభుత్వ సలహాదారు సజ్జలకు వినతి పత్రం ఇస్తున్న సుశీల రెడ్డి, నరసింహారెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రెడ్డి సామాజిక వర్గంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలు శుభ కార్యక్రమాలు, చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకునేందుకు నగరంలో కల్యాణ మండపాన్ని నిర్మించేకునేందుకు స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పులుగు సుశీల రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు బిక్క నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం తాడేపల్లిలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు వివిధ జిల్లాల నుంచి వలస వచ్చి జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. ఆయా కుటుంబాలు చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకోవాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఇళ్ల ముందు రోడ్డుపైనే చేసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రైవేట్ కల్యాణమండపాల అద్దెలను భరించే ఆర్థిక స్థోమత లేదన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్ర సమస్యలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కండ్లకలక రాకుండా ముందు జాగ్రత్తగా తీసుకునే హోమియో పిల్స్ పంపిణీ కార్యక్రమాన్ని కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నారాయణ రావు మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ వ్యాధుల్లో ఒకటిగా కండ్లకలక నగరంలో బాగా విస్తరిస్తుందన్నారు. విద్యార్థులు వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వారి సమస్యలను గమనంలో ఉంచుకొని కండ్లకలక రాకుండా ఉండేందుకు హోమియో మందులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. నిర్లక్ష్యం చేయకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు వీఏసరావు, పవన్‌కుమార్, సాంబశివరావు ఉన్నారు.

వరుణ్ కార్డియాక్‌లో న్యూరో సేవలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇప్పటి వరకూ గుండె వైద్య సేవలు అందించిన వరుణ్ కార్డియాక్ సెంటర్‌లో న్యూరో సేవలు అందుబాటులోకి వచ్చాయి. నగరానికి చెందిన న్యూరోసర్జన్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ ఇక్కడ సేవల అందించనున్నారు. దీంతో ఇక నుంచి వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరోసైన్సెస్‌గా రూపాంతరం చెందినట్లు ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ తెలిపారు. ఇక నుంచి కార్డియాలజీ, న్యూరాలజీకి సంబంధించి విస్తృతమైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలోని వరుణ్‌కార్డియాక్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ పువ్వాడ రామకృష్ణ మాట్లాడుతూ అధునాతన న్యూరో సర్జరీ సేవలతో పాటు, తలకు గాయాలు. మెదడు, వెన్నెముక సమస్యలు, చిన్నపిల్లలు, నవజాత శిశువుల్లో నాడీ సంబంధ వ్యాధులకు సమగ్ర చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ప్రముఖ ఫేషియల్ సర్జన్ డాక్టర్ సురేంద్ర పాల్గొన్నారు.

కిడ్నీదానంపై తప్పుడు సమాచారం

కేసు నమోదు చేసిన పోలీసులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కిడ్నీ దానం చేసే విషయంలో తహసీల్దార్‌కు తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తులపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి... భవానీపురం బాలభాస్కర్ నగర్‌కు చెందిన గాడి చిన్ని కూలీ పనులకు వెళుతోంది. ఆమె భర్త సురేష్ జ్యూస్ షాపులో పనిచేస్తున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నల్లమిల్లి దీపక్ రెడ్డి తన అన్న అని, కిడ్నీ దానం చేసేందుకు సర్టిఫికెట్ జారీ చేయాలని గాడి చిన్ని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసింది. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో గాడి చిన్ని , నల్లమిల్లి దీపక్ రెడ్డికి మధ్య ఎటువంటి రక్త సంబంధం లేదని తేలింది. వారిద్దరు వేర్వేరు కులాలకు చెందిన వారని తేలింది. దీంతో తప్పుడు సమాచారం ఇచ్చిన గాడి చిన్ని ఆమె భర్త సురేష్ పై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దీని వెనుక ఏదైనా కిడ్నీ రాకెట్ ఉందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెనలు

ఎన్టీఆర్ జిల్లాలో 40 మందికి రూ.6.34 కోట్ల లబ్ధి



విదేశీ విద్యా కానుక చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులు ప్రపంచంలోనే అత్యుత్తమ యూనివర్సిటీల్లో చదవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. ఆ లక్ష్యాన్ని నెరవేర్చేందుకే జగనన్న విదేశీ విద్య దీవెన పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకం విదేశాల్లో చదవాలనుకునే పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తోందన్నారు. జగనన్న విదేశీ విద్య దీవెన పథకం కింద అర్హులైన పేద విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో మొదటి, రెండో విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఢిల్లీ రావు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుతో కలిసి విద్యార్థులకు విదేశీ విద్యా దీవెన ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. జిల్లాలో 31 మంది విద్యార్థులకు రెండో విడత రూ.4.92 కోట్లు, తొమ్మిది మందికి మొదటి విడతగా రూ.1.42 కోట్ల చొప్పున రూ.6.34 కోట్లు అందజేశామన్నారు. పేద విద్యార్థులు కూడా ప్రపంచంలో టాప్ యూనివర్సిటీల్లో చదివించాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు కార్యరూపమే జగనన్న విదేశీ విద్య దీవెన పథకమని వివరించారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విదేశాల్లో రెట్టించిన ఉత్సాహంతో ఉన్నత విద్య అభ్యసించి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కుటుంబ వార్షికాదాయ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం రూ.8 లక్షలకు పెంచడంతో ఎక్కువ మందికి ఈ పథకం కింద ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో విదేశీ విద్యా దీవెన వంటి పథకం అమలవుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మాదు శివరామకృష్ణ, తోలేటి శ్రీకాంత్, గీతాంజలి దేవి, మనోజ్ కొఠారి, జమల పూర్ణమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ ఎం.విజయభారతి, గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య పాల్గొన్నారు.

లయోల కాలేజీలో రక్తదాన శిబిరం

గుణదల(విజయవాడ తూర్పు): సెయింట్ ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్లకు చెందిన విద్యార్థులు శిబిరంలో పాల్గొని 132 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ కార్యక్రమం జరిగినట్లు కాలేజీ ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ జి.ఎ.పి.కిషోర్ తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఫాదర్ ప్రభుదాస్, ఫాదర్ కిరణ్, ఫాదర్ యం.టి.ప్రభు, డాక్టర్ డి.వి.రమణరావు పాల్గొన్నారు.